# ఆ కళ్ళు!

**- పి. ఇందిరాదేవి**

"ప్రేమంటే తెలిసింది" హఠాత్తుగా అంది శృతి.

"ఏమిటీ ఆ మాట అంటున్నది నువ్వేనా... ఏదీ మళ్ళీ ఒక సారి అను. అప్పుడు కానీ నమ్మకం కలగదు నాకు". అంది నందిత ఆశ్చర్యంగా శృతి వైపు చూస్తూ.

"నేనే ఆ మాట అన్నది... ప్రేమంటే ఏమిటో ఇప్పుడు తెలిసింది. నాకే ఆశ్చర్యంగా వుంది, ఇన్ని సంవత్సరాల తర్వాత నాకు ప్రేమంటే ఏమిటో తెలియటం. అయినా ఎంతవరకు సఫలీ కృతురాలి నవుతానో తెలియదు" అంది శృతి.

"నాకు చాలా సంతోషంగా వుంది, ఇన్నాళ్ల తర్వాత నువ్వు మనుషులలో పడుతున్నందుకు. అయినా ప్రే మించేటప్పుడు భయపడకూడదు. భయపడేవాళ్లు ఎప్పుడూ ప్రేమించలేరు. ధైర్యంగా వుండు. ఇంతకీ కధానాయకు డెవరు?" అడిగింది నందిత నవ్వుతూ.

"ఆ వివరాలన్నీ ఇంటికి వెళ్లిన తర్వాత చెప్తాను." అంది లెడ్జర్ మూస్తూ శృతి.

నందిత, శృతి ఒకే బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నారు. శృతి గత చరిత్ర గురించి గానీ, ఆమె బంధు వర్గం గురించి గానీ ఎవరికీ తెలియదు. ఆ బాంకులో చేరిన తర్వాత గది కోసం వెదుకు తూంటే, సహోద్యోగిని అయిన నందిత కనిపించడం తనూ ఒంటరిగా వుంటు న్నదనీ, తన ఇంటిలో ఆమె వుండవచ్చునీ చెప్పడంతో శృతి నందితతో పాటే వుండడం జరిగింది. అయితే నందిత తన స్వవిషయాల గురించి ఎన్నడు ప్రశ్నించక పోవడం శృతికి నచ్చింది. ఆమె ఎక్కువగా మాట్లా డేది నందిత తోనే. అదీ బ్యాంకు విడిచి పెట్టి ఇంటికి వచ్చాకనే.

అటువంటిది, ఆరోజు బ్యాంకులో శృతి తనంతట తాను మాట్లాడటం, అదీ, ప్రేమ గురించి అవడం నందితకి సహజంగానే ఆశ్చర్యం కలిగించింది. ఆ ఆశ్చర్యం, ఎప్పుడూ ఏదో ఆలోచనలో వున్నట్లుండే శృతి గురించి తెలుసుకోవాలన్న కుతూహలంవైపు దారి తీసింది.

ఇంటికి చేరుకోగానే, కాఫీ గురించి కూడా ఆలోచించ కుండా "చెప్పు ఏమా ప్రేమ కథ?" అంది నందిత.

"కశ్యప్ తెలును కదా... ప్రతి సోమ, శనివారాలు తప్పని సరిగా డబ్బుడ్రా చెయ్యడానికి వస్తాడు."

"కశ్యప్ అంటే ఆ టాల్‌మాన్. ట్రిమ్ చేసిన గడ్డం తీక్షణంగా చూసే చూపులు, అతనేనా?" అడిగింది నందిత.

డాబా మీద చాపపరుచుకుని, ఒళ్లో దిండు పెట్టు కుని, రిలాక్స్‌డ్‌గా కూర్చుంది నందిత. చల్లటిగాలి వీస్తోంది. వాతావరణం ఎంతో అహ్లాదకరంగా వుంది పిట్ట గోడకి ఆనుకుని నవ్వుతూ 'అవునన్నట్లు' తల వూపింది శృతి.

"ఊ తరువాత కథ చెప్పు" అంది నందిత ఉత్సా హంగా.

శృతి చెప్పడం ప్రారంభించింది.

* * * *

ఆ రోజు బ్యాంకు, చాలా హడావిడిగా వుంది. ఆ సమయంలో..

"నేను ఈ రోజు వెయ్యి రూపాయలు డ్రా చేశాను పాస్‌బుక్‌లో మూడువేలు డ్రా చేసినట్లు వుందేమిటి? తలెత్తకుండా, అటూ ఇటూ చూడకుండా మీపనిలో నిమగ్నమై వున్నాకూడా ఇలాంటి తప్పులు రాస్తూవుంటా రన్నమాట" గంభీరంగా వినిపించిన ఆ మాటలకి చటుక్కున తలెత్తి చూసింది. ఒక్కక్షణం ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి. శృతి పాస్‌బుక్ ఇవ్వమన్న ట్లుగా చెయ్యి చాపింది. అందులో తను సరిగ్గానే ఎంటర్ చేసింది. అతని ఉద్దేశం ఏమిటి? ఎందుకు అబద్ధమాడా డు? పాస్‌బుక్‌తో పాటు అతను ఇచ్చిన చిన్న కాగితం శృతి చేతిలో వుండి పోయింది. అందులో,

"అవి కళ్లా...

అవి కళ్ళు కాదు. కలువ పువ్వులు!

ఆ కళ్లలో విషాద ఛ్ఛాయలు దాగియున్నాయేమిటి?

అవి చందమామలోని మచ్చలా వున్నాయి.

ఆ కళ్లని సృష్టించిన ఓసృష్టికర్తా... ఆ కళ్ల వెనుక దాగివున్న విషాద ఛ్ఛాయలను తొలగించు."

—కశ్యప్.

అని వుంది. చటుక్కున తలెత్తి చూసింది శృతి. కోపంగా అతని వైపు చూసింది. ఆ తర్వాత అతను ఆ విధంగా స్లిప్స్ అందించడం, సమాధానం ఆశించ కుండా వెళ్లిపోవడం జరిగింది. మనసునీ, శరీరాన్నీ ఏ విధమైన బలహీనతకి గురిచేయకుండా, కఠినంగా తనని తాను శిక్షించుకుంటూ జీవిస్తున్న శృతికి, కశ్యప్ ఆమెలో నిద్రిస్తున్న 'తీగలను' మీటి 'శృతి' పలికిస్తున్నా డు.

ఆమె తనని తాను కంట్రోల్ చేసుకునేందుకు విశ్వప్ర యత్నం చేసింది. మళ్లీ ఏ ఊబిలో పడుతుందోనన్న భయం! రాయిలా వుండాలన్నా సాధ్యంకావడం లేదు.

చివరికి తెగించి శృతి జవాబు రాసింది. పాస్‌బుక్‌లో ఆ కాగితం పెట్టి యిస్తున్నప్పుడు, శృతి చేతులు మొట్టమొ దటి సారిగా వణికాయి. ఆ జవాబు చదివిన కశ్యప్‌లో ఎంత వెలుగు.

ఆ రోజు నందితకి పని ఎక్కువగా వుండడంతో శృతి ముందుగా వచ్చేసింది. బస్టాపులో బస్సు కోసం నిలబడి వున్న శృతి, తనముందే ఓకారు ఆగడంతో ఎవరా అని చూసింది.

కశ్యప్!

కారు డోర్ తెరిచి ఎక్కమన్నట్లు చూశాడు కశ్యప్ చిరునవ్వుతో. శృతి సంకోచించకుండా కారు ఎక్కింది. కారు ఓఖరీదైన హొటల్ ముందు ఆపాడు. ఇద్దరూ హొటల్‌లోకి ప్రవేశించి ఒకరి కెదురుగా మరొకరు కూర్చున్నారు. కశ్యప్ శృతి కళ్లవైపే చూస్తున్నాడు.

"ఏం కళ్లు ఇవి! నేను కవినికాను. కవినై వుంటే ఈ కళ్ల మీద కావ్యాలు రాసి వుండేవాడిని." చూపుడు వేలు శృతి కళ్లమీద ఆన్చి ఆ వేలిని తన పెదవులకు ఆన్చి ముద్దు పెట్టుకున్నట్లుగా అభినయం చేశాడు కశ్యప్.

ఈ సంఘటన శృతి మనసును పులకింపజేసింది. ఒకరు తన కళ్లని ద్వేషించారు... మరొకరు ఆ కళ్లనే ఆరాధిస్తున్నారు. 'గుడ్లగూబ కళ్లు పెట్టుకు చూస్తావు దేనికీ... ఫో అవతలకి...' 'గత జీవితంలోని ఒక రూపం... తృళ్లిపడి వాస్తవంలోకి వచ్చింది శృతి ఆమె కళ్లల్లో స్పష్టంగా కనపడు తున్న భావాలు, కశ్యప్ కన్నార్పకుండా చూస్తున్నాడు. 'ఎందుకు ఈమె కళ్లల్లో ఇంత దిగులు ఎలాగైన ఆ దిగులు పోగొట్టి ఆకళ్లల్లోకి కొత్త వెలుగు తెప్పించాలి' అనుకున్నాడు.

ఆ తరువాత వారు అనేక సార్లు కలుసుకున్నారు. కానీ శృతిలోని ఆ వ్యథ, ఆ అపశృతి ఏమిటో... అదే... అతనికి అర్థం కాలేదు.

* * * *

"ఇదీ నా పరిస్థితి... ఏం చెయ్యమంటావో చెప్పునందూ" అంది శృతి.

"కశ్యప్‌ని పెళ్లి చేసుకో... అయినా నిన్ను చూపినప్పు

డల్లా నాకు ఒకటే బాధ నీలో స్పందనలు లేవా... కోరికలు లేవా? మనిద్దరిదీ ఒకటే వయసు. నా భర్త ప్రతివారం ఇక్కడికి వస్తారు. ఇదిగో ఈ ట్రాన్స్ఫర్ గొడవల వల్ల మేమిద్దరం దూరంగా వుంటున్నాం కానీ లేకపోతే ఆయన్ని విడిచి ఒక్కక్షణం కూడా వుండలేను నేను." అంది నందిత

"నా పరిస్థితి..."

"పరిస్థితి... పరిస్థితి అంటావు... ఏమిటా పరిస్థితి... అసలు నీలో నువ్వు ఎందుకు అలా మధన పడతూ వుంటావు. నిన్ను నువ్వెందు కిలా కఠినంగా శిక్షించు కుంటున్నావు?" అడిగింది నందిత.

శృతి సమాధానం చెప్పలేదు.

కానీ ఆ రాత్రి...

నిద్రపోతున్న నందితకి హఠాత్తుగా మెలకువ వచ్చింది. సన్నటి ఏడుపు వినవస్తోంది. సూట్కేస్ దగ్గర గా పెట్టుకుని, చేతిలో ఒక ఫోటో పట్టుకుని, చూస్తూ ఏడుస్తోంది శృతి. ఒక్క అంగలో నందిత శృతి దగ్గరకు వెళ్ళి, ఆ ఫోటో లాక్కుని చూసింది. ఫోటోలో ఇద్దరు పాపలువున్నారు. ఇద్దరు 5,6 సంవత్సరాల పాపలు శృతి వైపు ప్రశ్నార్థకంగా చూసింది.

"వారు నాబిడ్డలు నందు... ఇదుగో ఈ ఫోటోలోని వ్యక్తే... అంటే నామొగుడు అనబడే నాపాలిటి యముడు వీళ్ళని నాకు దూరం చేశాడు." అంటూ మరో ఫోటో చూపించింది.

"ఇన్నాళ్లూ నీగత చరిత్ర నేను అడగలేదు. నీలో ఏదో బాధ దాగివుందని తెలుసు శృతీ.. నీలోని బాధ ఏమిటో చెప్పు. మనసులోని బాధ బయటపెడితే కొంచెమైనా ఊరటకలుగుతుంది. నిన్ను బలవంత పెట్టను. చెప్పాలని పిస్తేనే చెప్పు" అంది నందిత.

"చెప్తాను ఈ గుండెలోని బరువును ఇక నేను మోయలేను " అంది శృతి

• • • •

శృతి భర్త ప్రీతమ్. పేరుకు తగ్గట్టే అందగాడు. లెక్చరర్. కానీ అందానికి, చేస్తున్న ఉద్యోగానికీ తగ్గ గుణం కాదు. శృతి అప్పటికే బ్యాంకు ఉద్యోగిని. ఇద్దరిదీ చక్కటి జంట అనేవారంతా.

ప్రీతమ్ అనుమాన పిశాచి. ఉద్యోగం చేస్తున్న భార్య ఆ ఉద్యోగం చేస్తున్న చోట మగవాళ్లతో చనువుగా వుంటుందని అనుమానం. శృతి ఉద్యోగం మానేస్తానంది.

"ఉద్యోగం మానేసి, అందరిలో నన్ను అవమానం పాలు చేయటానికా... పెళ్లాన్ని చంపుకు తింటున్నాడు అనుమానంతో అని అందరూ నన్నంటే నీ కానందంగా వుంటుందా?" అని కసిరేవాడు.

"ఎందుకలా అనవసరంగా అపోహపడతారు. ఇద్దరు పిల్లలతో ఉద్యోగం చెయ్యడం కష్టంగా వుంది. మనకి డబ్బుకి కొదవలేదుగా. ఇంకానేను ఉద్యోగం చెయ్యడం ఎందుకు" అంది శృతి.

ఎన్నడు లేనిది తనకి అలా ఎదురు సమాధానం చెప్పడం సహించలేకపోయాడు ప్రీతమ్. అతనిలోని శాడిస్ట్ తల ఎత్తాడు, శృతి బ్యాంకుకు వెళ్ల బోతుంటే,

అతి సామాన్యమైన అలంకరణతో బయల్దేరిన శృతిని ఆపి—"ఆఫీసుకు ఇవాళ కొత్త మొగవాడు ఎవరైనా వస్తున్నారా? అలా ముస్తాబయ్యావు?" అన్నాడు.

శృతి మాట్లాడలేదు.

"ఆ కాటుక దేనికీ... దయ్యంలాగా... అసలే గుడ్ల గూబ కళ్లు... ఇంకా దానికి తోడు కాటుక. ముందా కాటుక చెరుపు. ఆ గుడ్ల గూబ కళ్లని చూడలేక పోతున్నాను."

తెల్లబోయి చూసింది శృతి. విశాలమైన తన కళ్లకి కాటుక పెడితే వింత అందం వస్తుందంటారు తన స్నేహితురాళ్లు. అటు వంటిది... ఈయన ఇలా అంటున్నారేమిటి? మాట్లాడ కుండా కొబ్బరినూనెతో కాటుకపెట్టుకున్న చోట రాసి, శుభ్రంగా సబ్బుతో కడిగింది. ఆ రోజు నుంచి కాటుక పెట్టుకోలేదు. అద్దంలో తన కళ్లు చూసుకునే ప్రయత్నమూ చెయ్యలేదు.

కానీ...

శృతి గుండె మండి పోతోంది. ఉద్యోగం చేసి డబ్బు సంపాదిస్తున్నా గౌరవం లేదు. ఆ రోజు తెగేసి చెప్పింది. "నేను ఉద్యోగం చెయ్యాలంటే కొన్ని షరతులున్నాయి" అని.

ఆమె మాట పూర్తి కాకుండానే శృతి చెంపమీద



బలంగా కొట్టాడు ప్రీతమ్.

"ఇడియట్... నాదగ్గర షరతులా? చంపేస్తాను. ఉద్యోగం చేస్తున్నావని పొగరు. నీ షరతులు నేను వినను. నేను చెప్పింది నువ్వు వినాల్సిందే" అని విసురుగా వెళ్ళి పోయాడు ప్రీతమ్.

శృతి పిల్లలని దగ్గరకు తీసుకుని ఆలోచిస్తూ కూర్చుండి పోయింది.

ఆ రోజు రాత్రి శృతి భయపడినట్టుగా గొడవేమి జరగలేదు కానీ రెండు రోజుల తర్వాత—

"ఈ రోజు బెంగళూరు వెళుతున్నాం. బట్టలు సర్దు" అన్నాడు సౌమ్యంగా.

శృతి అతని కంఠంలోని సౌమ్యతకు ఆశ్చర్యపోయింది. అతనిలో మార్పు వస్తే అదే పదివేలనుకుంది.

ఆరాత్రి రైల్లో.

"ఉద్యోగం మానేసినట్టేనా." అనడిగాడు ప్రీతమ్.

"ఆఁ..." అంది శృతి.

"నా మాటంటే లెక్కలేదా?"

సమాధానం చెప్పలేదు శృతి.

"ఇదే నీ నిర్ణయమా?"

"అవును."

ప్రీతమ్ మరేమీ మాట్లాడకుండా కళ్ళు మూసుకుని సీటుకు జారగిలబడి కూర్చున్నాడు. తలుపు తెరిచి వుండడం చూసి, శృతి లేచి వెళ్ళి తలుపు వెయ్యబోయింది. వెనుక నుంచి బలమైన చెయ్యి శృతిని క్రిందకి తోసింది. ఆ తోసింది తన భర్త ప్రీతమ్ అని శృతికి తెలిసింది. కానీ అప్పటికే స్పృహ తప్పి క్రింద పడిపోయింది. రైలు వేగంగా తన మానాన తాను వెళ్ళిపోయింది.

* * * *

"మైగాడ్... అంత దారుణానికి వడిగట్టాడా నీ భర్త..." అంది నందిత. శృతి మౌనం వహించింది.

"అతడి మీద కేసు పెట్టక పోయావా..."

"ఎలా పెట్టను. న్యాయస్థానమూ పురుష పక్షపాతి అవుతే" అంది శృతి.

"అంటే... అసలు అంత పెద్ద ప్రమాదంనుంచి నువ్వెలా బయట పడ్డావు?" అడిగింది నందిత.

"పొలాల మధ్య స్పృహ తప్పి వున్న నన్ను కొందరు రైతులు స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు కానీ నా పరిస్థితి మెరుగు పడక పోయేసరికి హైద్రాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ డాక్టర్ పాటిల్ వైద్య చికిత్సలో నేను కోలుకున్నాను. ఆయన నా భర్తకు ఎన్ని ఉత్తరాలు రాసినా సమాధానంలేదు. ఈలోగా ఆరునెలలు గడిచి పోయాయి. నాపిల్లలని చూడాలన్న తహతహ గ్రహించిన డాక్టర్ పాటిల్ నన్ను హుబ్లీకి తీసుకువెళ్లారు. అయితే నాభర్త అప్పటికే మరో స్త్రీని వివాహం చేసుకున్నాడు. నన్ను చూసి ముందు తెల్లబోయినా, వికవు నవ్వునవ్వుతూ ఓ పేపర్ నాచేతికి ఇచ్చాడు. అందులో ఇలా వుంది.

"నా భార్య శృతి మతి స్థిమితం లేక రైల్లోంచి దూకి మరణించింది ఆమె పెద్దకర్మ ఫలాన చోట ఫలాన తారీఖున జరుగుతుంది."

ఆ పేపర్ అతని మొహం మీదకి విసిరి కొట్టాను. "నాపిల్ల లేరి.. నేను వచ్చింది వాళ్ళకోసం" అన్నాను.

ఆ ఇద్దర్నీ అతడు హాస్టల్లో చేర్పించానన్నాడు. ఏ హాస్టల్లో చెప్పలేదు. డా॥ పాటిల్ కేసు పెడదామన్నారు. కానీ ప్రీతమ్ గురించి నాకు బాగా తెలుసు. కేసు పెడితే, ఆ పిల్లలని నాకు దక్కనీయకుండా చేయడానికి ఎంత ఘాతుకానికైనా వెనుదీయని కిరాతకుడు... అందుకే వద్దన్నాను. అయితే డా॥ పాటిల్ సహాయంతో అక్కడున్న కొన్ని హాస్టల్లు వెదికాను. కానీ నాపిల్లలు నాకు కనిపించ లేదు. విరక్తి చెందిన నన్ను డా॥ పాటిల్ ఊరడించి, ధైర్యం చెప్పారు. ఆయనకి నా వంటి చెల్లెలు వుండేదిట. అలా నేనూ ఒక శాడిస్టుకి బలికాకూడదని ఆయన ఆరాటం. ఆయన ప్రయత్నంతోనే మళ్ళీ ఈ ఉద్యోగం సంపాదించగలిగాను, ఈ ఊళ్ళో." అంది శృతి.

అంతా విని నందిత గాఢంగా నిట్టూర్చింది. "శృతీ.. నువ్వు గత జీవితాన్నీ మరచిపో. కశ్యప్‌ని వివాహం చేసుకో" అంది.

"అవును. కానీ కశ్యప్‌కి నా జీవితం గురించి అంతా చెబుతాను. అతను ఒప్పుకుంటే సరే సరి. లేకుంటే ఇక ఆ విషయం గురించి ఆలోచించడం అనవసరం" అంది శృతి.

"గుడ్" అంది నందిత శృతి వైపు ప్రశంసాపూర్వకంగా చూస్తూ.

* * * *

వెన్నెల వెలుగులో సరస్సులోని నీళ్లు వెండిపళ్లె

## ఆశానలం

వేదనా భరిత హృదయాన్ని—నేను
ఆనంద సాగర కెరటాన్ని!
ఆనందం వినా
నాహృదయం విగతస్పందం!
నాజీవన శకటానికి తైలం
నా నుదుటి స్వేదం!

నా ముఖమంతా అల్లుకున్న
వికారపు ముడతలు
నిరుటి అనుభవాల
సౌందర్యప్రతిబింబాలు!

నాకళ్లు—
కణకణలాడే విశ్వాస
ఆశానల కణికలు!!

—'బాల'

## వనిత మాటల కొలువు 127

సరైన సమాధానం :

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ఆ | ల | య | ము | | ప | వి | త |
| ధా | | ము | | శ్ర | ని | | క్ష |
| ర | త | న | ము | | | వి | జా |
| ము | గ్రా | | స | ప | ని | త | ము |
| లు | | | స | లి | ల | ము | |
| | స | | ను | | క | | ప |
| ము | త్తె | | | యు | ము | నో | త్రి |
| చి | ప | స | ము | | | వి | క |

ఈ సమాధానంతో సరిపోయే సమాధానం రాసిన వారు :

కె. మహాదేవి, యలమంచలి

బహుమతి మొత్తం రూ. 200 లు వీరికి అందజేస్తున్నాము.

మెరుస్తున్నాయి. శృతి ఆ నీటి వంక తదేకంగా చూస్తోంది, కశ్యప్ మొహంలోకి చూసే ధైర్యంలేక.

కశ్యప్ వెన్నెల వెలుగులో మెరుస్తున్న నీటిని శృతి మీద నుతారంగా చల్లాడు. ఒక్క సారిగా చల్లటి నీళ్లు మీద పడడంతో ఉలిక్కిపడి చూసింది శృతి. నవ్వుతూ ఆమె భుజం మీద చేయివేసి, "వెళదాం పద... ఎంత సేపు అలా చూస్తూ కూర్చుంటావు. "అనడిగాడు కశ్యప్. అతనికి చేయి అందించి లేచి నిల బడింది శృతి. ఆమె మనసు ఎంతో తేలికగా, హాయిగా వుంది, అతనితో అంతా చెప్పాక.

కారులో తన ప్రక్కన కూర్చున్న శృతి భుజం చుట్టూ చెయ్యివేసి "మనల్ని ఎవరూ వేరు చేయలేరు శృతీ" అన్నాడు కశ్యప్. అతని కుడి చెయ్యి స్టీరింగ్ వీల్ మీదవుంది. కారు వేగంగా పోతోంది.

"శృతి కాదు"

"మరి"

"శృతీ కశ్యప్" అందిశృతి.

చిరునవ్వు నవ్వాడు కశ్యప్.

అయితే ఆనవ్వు ఎంతో సేపులేదు. ఎదురుగా శరవేగంతో వస్తున్న లారీని చూసి కారు పక్కకి మళ్లించేలోపల ప్రమాదం జరిగిపోయింది. కెవ్వున కేకవేస్తూ స్పృహ తప్పి పడిపోయింది శృతి.

* * * *

ఉస్మానియా హాస్పటల్‌లో కళ్ళు తెరచిన కశ్యప్‌కి తను ఎక్కడ ఉన్నదీ తెలిసింది. కళ్లకి బేండేజి ఉంది. యాక్సిడెంట్ అవటం వరకే గుర్తుఉంది. తరువాత ఏం జరిగింది శృతి ఎక్కడ ఉంది?

"నాకు చూడాలని ఉంది. నాకళ్ళకు కట్టిన బాండేజి విప్పేయండి." అన్నాడు.

"ఇవాళ ఒక్క రోజు ఓపిక పట్టండి రేపు విప్పుతాం," నచ్చచెప్పాడు డాక్టర్.

"ఏం ఎందుకు విప్పకూడదు." అడిగాడు కశ్యప్.

"తలకి, కంటికి బాగా దెబ్బతగలటం వల్ల మీకు ఆపరేషన్ చేశాం. రేపు కట్లు విప్పుతాం." చెప్పాడు డాక్టర్.

"ఎన్నిరోజులు అయ్యింది? ఇలా హాస్పటల్‌లో ఉండి," అడిగాడు.

"పదిరోజు లయ్యింది."

"నా ప్రక్కన శృతి అనే ఆమె ఉండేది. ఆమె ఎక్కడ ఉంది," అడిగాడు. "ఆమెకూడా ఇదే హాస్పటల్‌లో ఉంది. క్షేమంగాఉంది. దిగులు పడకండి." చెప్పాడు డాక్టరు.

ఆమరునాడు. కట్లు విప్పి నెమ్మదిగా చూడ మన్నాడు డాక్టరు. అతను చెప్పినట్లుగానే చేస్తూ నెమ్మదిగా కళ్ళు విప్పిచూశాడు. చుట్టూ ఆత్రంగా తననే చూస్తూ నిలబడ్డ డాక్టర్, సిస్టర్స్‌ని చూసి-"డాక్టర్ శృతి ఎక్కడ." అడిగాడు కశ్యప్. అతనికి సమాధానం చెప్పకుండా, డాక్టర్ బయటకు వెళ్లిపోయాడు. అతని ననుసరించిమిగతా వాళ్ళు వెళ్ళి పోయారు. కశ్యప్‌కి ఏమీ అర్థంకాలేదు. పిచ్చిగా ఉంది. ఎవర్నో ఒకర్ని పిలిచి విషయంకనుక్కోవాలి. కాలింగ్ బెల్ నొక్కాలని ప్రక్కకితిరిగాడు. అక్కడ ఒక లెటర్ కనిపించింది. దాని మీద 'కశ్యప్‌కి, శృతి' అన్న అక్షరాలు కనిపించాయి. అందులో,

"డియర్ కశ్యప్, నాకళ్ళతో చూస్తూ ఈ ఉత్తరం రాస్తున్నాను. ఇదే ఉత్తరాన్ని నాకళ్ళతో చూస్తూ చదువుతున్నాను. అర్థమయిన దనుకుంటాను, యాక్సిడెంట్‌లో నీ కళ్ళు పోయాయి. నాకు బాగా దెబ్బలు తగిలాయి. బ్రతుకుతాననే నమ్మకంనాకు లేదు. మీరు ఎంతగానో ఇష్టపడుతున్న 'కళ్ళు', వీటిని దానం చేయాలనుకున్నాను. అప్పుడే తెలిసింది. మీ కళ్ళుపోయాయని.

ఒక రోజు మీరు అన్నారు. ఈ కళ్ళ ని శాశ్వతంగా నావాటిని ఎప్పుడు చేసుకుంటానో అని; రెండవసారి గండి పేట చెఱువు దగ్గర ఇదేమాట అన్నారు. మూడవ సారి ఆమాటలన కుండా శాశ్వతంగా ఈ కళ్లని, మీ కళ్లుగా చేస్తున్నాను. నా దురదృష్టంన్నాకు అర్థంకావటంలేదు. ఆదృష్టంవరించి నట్లుగా వరించి దూరమవుతుంది. భవిష్యత్తు గురించి ఎన్నికలలు కన్నాను. మిమ్మల్ని 'పెళ్ళి' చేసుకున్న తరువాత నా ఇద్దరు బిడ్డల్ని తెచ్చుకుని అపురూపంగా పెంచాలని ఆశపడ్డాను. ఆ ఆశతీరకుండానే ఈ లోకాన్ని విడిచి పెట్టవలసివస్తున్నది. నాది ఆఖరిగా ఒకకోరిక. ఇన్ని సం॥లుగడచినా నాబిడ్డల్ని చూసుకునే అవకాశంరాలేదు. ఎప్పటికైనా మీరు నాబిడ్డలకి 'తండ్రి' నని చెప్పి మీరే ఆబిడ్డల్ని దగ్గర చేర్చి పెంచండి. మీకు అమర్చిన నాకళ్ళతో నా... కాదుకాదు 'మన' పాపల్ని చూస్తాను. నాకు అదేతృప్తిగా ఉంటుంది. వచ్చేజన్మలో మీ భార్యని కావాలని కోరుకుంటున్నాను." అంతా చదివిన కశ్యప్ కళ్ళల్లో కన్నీరు. ఆ కన్నీరు మధ్యలో మసకగా కనిపిస్తున్న డాక్టర్ పాటిల్, నందిత కనపడ్డారు.

నందిత శృతి ఫోటో ఒక చేతిలో, అద్దం ఒక చేతిలో పట్టుకుని కశ్యప్‌కి చూపించింది. శృతి ఫోటోని చూస్తున్న కశ్యప్‌కి, నన్ను నేనే చూసుకుంటున్నాను." నవ్వుతూ అన్నట్లు ఉంది, అద్దంలో తనకి అమర్చిన శృతి కళ్ళని చూస్తూ తన చేతిని కళ్ళమీద ఆనించి ఆచేతిని ముద్దు పెట్టుకున్నాడు.

"నీ కోరికతీరుస్తాను శృతీ నీ బిడ్డల్ని తెచ్చి ఈకళ్ళతో చూస్తూ మన బిడ్డలుగా పెంచుతాను. ఒకప్పుడు "శాశ్వతంగా ఈకళ్ళని నా వాటిని ఎప్పుడు చేస్తావు అన్నందుకు అవి నిజంగా నాకు శాశ్వతంగాస్వంతమైనాయి." అంటూ రోదించాడు కశ్యప్.

"కంటికి ఎక్కువ శ్రమకలిగించకు మైడియర్‌యంగ్ మాన్." భుజంతట్టి ఆప్యాయంగా చెప్పాడు డాక్టర్ పాటిల్. అతని కళ్ళల్లో సన్నటినీటి పొర.



## పోల్చుకోండి చూద్దాం!

## 3

ఈ ఫోటోలో వున్న వనిత—ఒక సుప్రసిద్ధ రచయిత్రి. ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి 'కళాప్రపూర్ణ' అందుకున్న రచయిత్రి. వదలాలిత్యమూ, మృదుమధురమూ అయిన ఆమె రచనా శైలి ఎందరికో మార్గదర్శకం అయింది.

**ఒక చిన్నక్లూ: రాష్ట్రసాహిత్య అకాడెమీకి ఉపాధ్యక్షురాలుగా మూడుసార్లు ఎన్నికై 'హ్యాట్రిక్' సాధించిన ఏకైక వనిత!**

ఒక కార్డు మీద ఆ 'సుప్రసిద్ధరచయిత్రి' పేరు రాసి 'వనిత' చిరునామాకు మార్చి 20వ తేదీలోగా చేరేలా పంపాలి. సరైన సమాధానం రాసిన ముగ్గురికి చిన్న బహుమతి పంపుతాము. సరైన సమాధానం రాసిన వారు ముగ్గురి కంటె ఎక్కువ మంది గనక వుంటే లాటరీ పద్ధతిలో ముగ్గురి పేర్లు తియ్యవలసివస్తుంది.

**ఫలితాలు: మే (86) సంచికలో!**